సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలాజీ నిత్యాన్నదానం ట్రస్టుకు కడలి కృష్ణమూర్తి, కాళికాదేవి దంపతుల స్మారకార్థం వారి కుమార్తెలు రూ.50,232 అందజేశారు.



రూ.60,500 సమర్పణ

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి ఎ.సాయిరామ్ దంపతులు (రాజానగరం మండలం ముక్కినాడ) సోమవారం రూ.60,500 సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

చురుగ్గా వసంత మంటపం పునర్నిర్మాణం



అంతర్వేదిలో నిర్మాణంలో ఉన్న వసంత మంటపం

సఖినేటిపల్లి: అంతర్వేదిలో వసంత మంటపం పునర్నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఏటా లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పౌర్ణమి రోజున సముద్ర స్నానం అనంతరం స్వామి వసంత మంటపంలో సేద తీరడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో ఇక్కడ నిర్మించిన మంటపం శిథిల స్థితికి చేరుకోవడంతో మంటపం పునర్నిర్మాణ పనులను రూ.18 లక్షలతో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ నుంచి మొదలయ్యే స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 24వ తేదీన నిర్వహించే చక్రవారి సముద్ర స్నానం(పౌర్ణమి స్నానాలు)రోజుకు ముందుగా మంటపం పూర్తి చేసేలా పనులను వేగవంతం చేశారు.

ఆడియో క్లిప్పింగ్‌ల ద్వారా శిక్షణ



ఆడియో క్లిప్పింగ్‌లను ప్రారంభిస్తున్న డీఈఓ కమలకుమారి తదితరులు

ముమ్మిడివరం: పదవ తరగతి విద్యార్థులకు ఆడియో క్లిప్పింగ్‌ల ద్వారా శిక్షణ ఇచ్చి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి కె.కమలకుమారి సూచించారు. ముమ్మిడివరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె వీడియో క్లిప్పింగ్‌లను ప్రారంభించి ఆయా పాఠశాలలకు అందజేశారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు నెలరోజులుగా అన్ని సబ్జెక్టులలో రివిజన్ టెస్టు నిర్వహించామన్నారు. ఒక మార్కు ప్రశ్నలకు ఉపాధ్యాయులతో చెప్పించిన ఆడియో క్లిప్పింగ్‌లను సిద్ధం చేశారు. వీటిని ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా విద్యార్థులకు వినిపించే విధంగా ఏర్పాటు చేశామని డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు తెలిపారు. తెలుగులో ప్రభావతి, ఇంగ్లిషులో జగపతి, వెంకటేశ్వరరావు, హిందీలో బాషా, గణితంలో పీఎస్ నరసింహరావు, సైన్స్ ఆర్.భాస్కరరావు, సోషల్‌లో కృష్ణారెడ్డి సాయంతో ఈ ఆడియో క్లిప్పింగ్‌లను తయారు చేసినట్టు తెలిపారు.

నేడు విఘ్నేశ్వరునికి సప్తనదీ జలాభిషేకం



సప్తనదీ జలాలతో ఆలయ సిబ్బంది

అయినవిల్లి: శ్రీ పంచమి సందర్భంగా విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో గణపతి కల్ప ప్రారంభంతో సప్తనదీ జలాభిషేక సహిత లక్ష కలాల వితరణ మహోత్సవాలకు మంగళవారం శ్రీకారం చుడతారు. ఫిబ్రవరి 13 నుంచి 15 తేదీ వరకు మహాక్రతువులు నిర్వహించడానికి సర్వం సిద్ధమైనట్లు చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. గోదావరి, గంగ, యమున, సరస్వతి, సింధు, కావేరి, నర్మద నదుల నుంచి ఆలయ అధికారులు జలాలు సేకరించారు. వాటిని భక్తుల దర్శనం కోసం ఆలయ మంటపంలో ఉంచారు. జలాభిషేకం అనంతరం స్వామివారి పాదాలకు లక్ష కలాలతో పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులచే సరస్వతీ పూజలు చేయించనున్నారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవ్వనున్నారని, అందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ, చైర్మన్ తెలిపారు.

నరసన్న హుండీల రాబడి రూ.24,41,574

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామివారికి భక్తుల నుంచి వివిధ హుండీల ద్వారా మొత్తం రూ.24,41,574 వచ్చింది. సోమవారం ఆలయంలో కోనసీమ జిల్లా ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగ మల్లేశ్వరరావు, ఎండోమెంట్స్ ఈవో బి.వీర వెంకటేశ్వరరావుల సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 38 రోజులకుగాను వచ్చిన పై మొత్తంలో మెయిన్ హుండీ, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.23,77,401, అన్నదానం హుండీ ద్వారా రూ.64,173 ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు పాల్గొన్నారు.

పేదరికంపై మెప్మా యుద్ధం

- నాలుగున్నరేళ్లలో రూ.805 కోట్లతో ఉపాధి మార్గాలు
- స్వయం శక్తి సంఘాల మహిళలకు ఆర్థిక చేయూత
- వ్యాపారాలతో 1.50 లక్షల మందికి మెరుగైన జీవనం



అమలాపురం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటైన అర్బన్ మార్కెట్

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లాలోని పట్టణాల్లో పేదరికంపై యుద్ధం చేస్తూనే వారి జీవన వికాసానికి, ఉపాధి మార్గాలకు ఊతం ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మెప్మా ద్వారా 12 పథకాల అమలుతో వారి సంక్షేమానికి వారధిగా నిలుస్తోంది. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలో గత నాలుగున్నరేళ్లలో మెప్మా దాదాపు రూ.1.50 లక్షల మందికి రూ.805 కోట్లతో వివిధ పథకాలతో బాసటగా నిలిచింది. పట్టణాల్లో ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన డ్వాక్రా మహిళల బతుకుల్లో ఆర్థిక వెలుగులు నింపింది. పచ్చళ్ల, పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్లు, ఆర్టిఫిషియల్ జ్యూయలరీ, క్లీనింగ్ లిక్విడ్‌ల తయారీ యూనిట్లు, వన్ గ్రామ్ గోల్డ్ తయారీ, వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాలు ఇలా పలు చిరు వ్యాపారాలతో మహిళలు తమ ఇంటి వద్ద నుంచే ఉపాధి మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు.

ఆర్థికంగా ఆదుకున్న పథకాలు

బ్యాంక్ లింకేజీతో స్వయం సహాయక సంఘాలకు పలు పథకాల కింద ప్రభుత్వం ఆర్థిక చేయూత ఇచ్చింది. 2019 నుంచి ఇప్పటి వరకూ జిల్లాలోని పట్టణాల్లో 6,668 సంఘాలకు రూ.542.72 కోట్ల మేర రుణాలు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,173 సంఘాలకు రూ.153.92 కోట్ల రుణాలు సమకూర్చింది.

వైఎస్సార్ ఆసరా

ఈ పథకం ద్వారా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించింది. 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ మహిళలు తీసుకున్న రుణాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు దశల్లో తిరిగి చెల్లించింది. ఈ పథకం ద్వారా 2,635 సంఘాలకు రూ.66.44 కోట్ల లబ్ధి చేకూర్చింది.

వైఎస్సార్ సున్నా వడ్డీ

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించేందుకు, వారిపై పడిన వడ్డీ భారాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం వారి వడ్డీ రాయితీ పథకాన్ని వైఎస్సార్ సున్నా వడ్డీగా అమలు చేసింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 3,131 సంఘాలకు రూ.18.07 కోట్లు మంజూరు చేసింది.

వైఎస్సార్ చేయూత

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన 45 – 60 మధ్య వయసు ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థిక సాయం సమకూరింది. తద్వారా మహిళలు జీవనోపాధులు మెరుగు పరుచుకుంటూ ఐటీసీ తదితర కంపెనీల సహకారంతో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఏడాదికి ఒక్కో మహిళకు రూ.18,750 వంతున అందించి ఆదుకుంది. గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం వీరికి మొత్తం రూ.75 వేలు సమకూర్చింది. ఈ ఆర్థిక సాయంతో పాటు బ్యాంక్‌ల ద్వారా రుణ సహాయం పొంది ఉపాధికి బాటలు వేసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 7,051 మంది మహిళలకు రూ.38.71 కోట్లు మంజూరు చేసింది.

జగనన్న తోడు

జగనన్న తోడు పథకం 2020 సంవత్సరం నుంచి అమలవుతోంది. ఈ పథకం చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు వెన్ను దన్ను అయింది. రూ.10 వేల వడ్డీ లేని రుణాన్ని అందించి ఆదుకుంది. జిల్లాలో 14,199 మంది వీధి విక్రయదారులకు బ్యాంక్‌ల ద్వారా రూ.14.19 కోట్ల రుణాలు కల్పించింది. 7,838 మంది లబ్ధిదారులకు రూ.36 లక్షల మేర వడ్డీ రాయితీ మంజూరు చేసింది. ఇదే మాదిరిగా కేంద్ర ప్రభుత్వం కూడా పీంఎ స్వానిధి ద్వారా రూ.10 వేల వంతున రుణం ఇచ్చింది. జిల్లాలో ఈ పథకం ద్వారా 9,510 మందికి రూ.16.03 కోట్ల లబ్ధి చేకూరింది.

4,912 గృహాలు

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (ఏపీ టిడ్కో ద్వారా అభివృద్ధి చేసిన ఇళ్ల కేటాయింపును పారదర్శకంగా చేసింది. జిల్లాలోని పట్టణాల్లో టిడ్కో ద్వారా 4,942 గృహాలను నిర్మించింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 4,051 మంది లబ్ధిదారులకు రూ.141.67 కోట్ల మేర రుణాలను మంజూరు చేసింది. ఇవి కాకుండా నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పేరిట జగనన్న కాలనీలతో జిల్లాలోని పట్టణాల్లో 1,325 లబ్ధిదారులకు రూ.5.34 కోట్ల మేర రుణాలు ఇచ్చింది.

ఆహా క్యాంటీన్లు... అర్బన్ మార్కెట్లు

పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆసరా, సున్నా వడ్డీ, చేయూతతోపాటు మెప్మా ఆర్థిక సాయంతో జిల్లాలోని పట్టణాల్లో ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారాన్ని ఈ క్యాంటీన్ల ద్వారా ప్రభుత్వం సమకూర్చుతోంది. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో రుణాలతో మహిళలు అనేక చిరు వ్యాపారాలు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. అర్బన్ మార్కెట్ల పేర డ్వాక్రా మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించి లబ్ధి పొందుతున్నారు.

ప్రగతి యూనిట్ల ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు ఆయా రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి మెప్మా యంత్ర సామగ్రి, సరకులు సమకూర్చుతోంది. వీరి దుకాణాలకు నాలుగు నెలల అద్దెను కూడా అందిస్తోంది. ప్రగతి యూనిట్ల ద్వారా పట్టణాల్లో కొన్ని డ్వాక్రా సంఘాల సభ్యులు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. చేతుల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీ కార్యాలయాల వద్ద కాంటాక్ట్ లెస్ వాష్ హ్యాండ్ స్టేషన్లను మెప్మా ఏర్పాటు చేసింది.

పట్టణాల్లో పేదరిక నిర్మూలనే ధ్యేయం



పట్టణాల్లో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతోనే మెప్మా పనిచేస్తోంది. గత నాలుగున్నరేళ్లలో పట్టణాల మురికివాడల ప్రజల్లో దాదాపుగా పేదరికాన్ని వివిధ ప్రభుత్వ పథకాల సాయంతో నిర్మూలించాం. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు ఆర్థికంగా స్థిరపడేలా మెప్మా కృషి చేసింది. నాలుగున్నరేళ్లలో రూ.805 కోట్లతో 1.50 లక్షల మంది జీవన ప్రమాణాలను మెరుగు పరిచింది.

–బి.ప్రియంవద, ప్రాజెక్ట్ డైరెక్టర్, మెప్మా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

స్వయం ఉపాధి పొందుతున్నా



పట్టణ ప్రగతి యూనిట్ ద్వారా పేపర్ ప్లేట్స్ యూనిట్‌ను నెలకొల్పాను. రూ.1.80 లక్షల రుణంతో యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నాను. జగనన్న ప్రభుత్వంలో నేను ఆసరా పథకం నుంచి లబ్ధి పొందాను. వితంతు పింఛను అందుకుంటున్నాను. మా అబ్బాయికి జగనన్న ప్రభుత్వం వలంటీర్ ఉద్యోగం ఇచ్చింది. ఇప్పుడు నా కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బంది లేకుండా ఉంది.

– కుడుపూడి సుజాత, పేపర్ ప్లేట్ యూనిట్ యాజమానురాలు, మెప్మా లబ్ధిదారు, అమలాపురం

నాణ్యతా ప్రమాణాలతో పరిష్కారం

స్పందన ఫిర్యాదులపై అధికారులకు కలెక్టర్ ఆదేశం



స్పందనలో అర్జీలను తీసుకుంటున్న కలెక్టర్ శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: జగనన్నకు చెబుదాం–ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలలో అందిన అర్జీలను నాణ్యత ప్రమాణాలతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో కలెక్టర్ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాలను జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబుతో కలసి అర్జీలను స్వీకరించారు. మండల స్థాయి నుంచి వచ్చిన అర్జీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వర్చువల్ విధానంలో సంప్రదించి పరిష్కార మార్గాలు చూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 235 అర్జీలు వచ్చాయి. సీపీవో వెంకటేశ్వర్లు, డీపీఓ కృష్ణకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పి.ప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డీఎస్ఓ ఎ.పాపారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మదన్‌మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.10 లక్షల సహాయం

దాతృత్వాన్ని చాటుకున్న విద్యార్థులు



సేకరించిన రూ.10 లక్షలను విద్యార్థి తల్లిదండ్రులకు అందిస్తున్న ఎంఈఓలు

మామిడికుదురు: తమతో కలిసి చదువుకున్న విద్యార్థికి కష్టం వచ్చిందని తెలిసిన సహచర విద్యార్థులు చలించిపోయారు. విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్పందించి రూ.10 లక్షలు సేకరించి విద్యార్థి కుటుంబ సభ్యులకు అందించి సేవాగుణాన్ని చాటుకున్నారు. నగరంలోని ఎడ్యుకేర్‌లో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బళ్ల రామ్‌యోచన్ రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. కొన్ని రోజులుగా ప్రతి రెండు రోజులకు రామ్‌యోచనకు డయాలసిస్ చేస్తున్నారు. డాక్టర్లు అతనికి కిడ్నీ మార్పిడి చేయాలన్నారు. దీనికి రూ.15 లక్షల ఖర్చు అవుతుందన్నారు. రామ్‌యోచన్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. దీంతో స్పందించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.10 లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని విద్యాసంస్థల అధినేత కె.మురార్జీ.. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు సమక్షంలో సోమవారం రామ్‌యోచన పేరెంట్స్‌కు అందించారు.

డీఆర్వోగా వెంకటేశ్వర్లు



అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారిగా మొగిలి వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరుగుతున్న లోక్‌సభ, శాసనసభ సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఈ బదిలీ జరిగింది. ఆయన కృష్ణాజిల్లా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చాన్సలర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు డీఆర్వోగా వచ్చారు. ఇప్పటివరకు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేసిన సీహెచ్ సత్తిబాబు బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీపై వెళ్లారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా కృష్ణాజిల్లా మొవ్వ తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పరిపాలనాధికారిగా విధులు నిర్వహించిన కె.కాశీ విశ్వేశ్వరరావు ఏలూరు జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా బదిలీపై వెళ్లారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

అధికారులకు జేసీ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కమిటీ సభ్యులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేటు, రెగ్యులర్ విద్యార్థులు 10,871 మంది బాలురు ,10,242 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. 61 పరీక్షా కేంద్రాలు బీ కేటగిరి, 51 పరీక్ష కేంద్రాలు సీ కేటగిరీలో ఉన్నాయన్నారు. 24 పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలను భద్రత పరుస్తామని చెప్పారు. కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ స్టోరేజ్ పాయింట్‌గా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక చేశామన్నారు. కపిలేశ్వరపురం మండలంలో ఒక పరీక్ష కేంద్రాన్ని సమస్యాత్మకంగా గుర్తించామని చెప్పారు. 112 పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, బందోబస్తు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు పరీక్ష సమయాలలో మూసి వేయించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలన్నింటిలో తాగునీరు ,రన్నింగ్‌వాటర్‌తో మరుగుదొడ్లు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా పరీక్షా కేంద్రాల రూట్లలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లను స్క్వాడ్ సిబ్బందిని విద్యాశాఖ అధికారులు నియమించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్ఎంలను నియమించి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంపొందించే దిశగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సీడీ గ్రేడ్ విద్యార్థుల కోసం రోజువారీ రివిజన్ పరీక్షలను నిర్వహించాలన్నారు. జిల్లా అడ్మిన్ ఎస్పీ ఖాదర్ బాషా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం. సురేష్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ బి.హనుమంతరావు, డీటీవో అశోక్ ప్రతాప్‌రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్ భరతలక్ష్మి పాల్గొన్నారు.

ఆయుష్షును హరిస్తున్న కాలుష్యం

- మృత్యువాత పడుతున్న సముద్ర తాబేళ్లు
- నియంత్రణ లేని చేపల వేట, చమురు వ్యర్థాలతో అనర్థం



బంగాళాఖాతంలో చమురు సంస్థలు ఏర్పాటు చేసిన చమురు అన్వేషణ రిగ్గు


కాట్రేనికోన: భూమి మీద అత్యధిక ఆయుర్దాయమున్న జీవుల్లో తాబేలు ఒకటి. ఇది సుమారు 200 ఏళ్లకు పైబడి జీవిస్తుంది. అలాంటి తాబేలు తాతలకు ఏం కష్టమొచ్చిందో ఏమో బంగాళాఖాతం సముద్ర తీరం వెంబడి అధిక సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. హిందూ మహా సముద్ర జలాల నుంచి సంతానోత్పత్తి కోసం ఆడ, మగ తాబేళ్లు బంగాళాఖాతానికి ఏటా వలస వస్తాయి. ఇక్కడే ఆడ, మగ తాబేళ్లు జత కట్టి గుడ్లు పెట్టేంత వరకూ తీరం వెంబడి జీవిస్తాయి. గుడ్లు వదిలిన అనంతరం తిరిగి హిందూ మహా సముద్ర జలాలకు వెళ్లిపోతాయి. అయితే సంతానోత్పత్తి కోసం సముద్ర జలాలకు వచ్చిన వందలాది ఆలివ్ రిడ్లే తాబేళ్లు వలల్లో చిక్కుకోవడం, కలుషితమైన సముద్ర జలాల కారణంగా మృత్యువాత పడుతున్నాయి. అలా చనిపోయిన తాబేళ్ల కళేబరాలు తీరం వెంబడి కాకులు, కుక్కలు, నక్కలు, పీతలు, ఇతర జీవులకు ఆహారంగా మారుతున్నాయి. చనిపోయిన తాబేళ్లను పరిశీలిస్తే ఆయిల్ వాసన వస్తోందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు.

నియంత్రణ లేని చేపల వేట

మత్స్యకారులు సముద్ర జలాల్లో అడ్డూ అదుపు లేకుండా చేస్తున్న చేపల వేట సముద్రపు తాబేళ్ల పాలిట శాపంగా మారింది. మత్స్యకారులు పాడైపోయిన ప్లాస్టిక్ వలలను సముద్ర జలాల్లో పాడేయడం, చేపల వేట కోసం సముద్రంలో వదిలిన వలల్లో తాబేళ్లు చిక్కుకోవడంతో మృత్యువాత పడుతున్నాయి. చేపల వేట చేస్తున్న బోటు వలలో పడిన తాబేళ్లు గంటల పాటు వలలో ఉండిపోవడంతో ఊపిరాడక చనిపోతున్నాయి. సంతానోత్పత్తి కోసం సుదీర్ఘ ప్రయాణం చేసి బంగాళాఖాతం సముద్ర జలాలకు చేరిన ఆడ, మగ తాబేళ్లు ఇక్కడే జత కట్టి గుడ్లు పెట్టే వరకూ తీరం వెంబడి సముద్రపు కెరటాలకు చేరువలో ఉంటాయి. తీరం వెంబడి కెరటాలకు చేరువలో బోట్లు చేపల వేట చేయడంతో అధిక సంఖ్యలో తాబేళ్లు వలల్లో చిక్కుకుని మృత్యువాత పడుతున్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

కలుషితమవుతున్న సముద్ర జలాలు

చమురు సంస్థలు చేపట్టిన చమురు అన్వేషణ పనులతో విడుదలవుతున్న వ్యర్థాల కారణంగా సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 200 ఏళ్ల పాటు జీవించే ఆలివ్ రిడ్లే జాతికి చెందిన సముద్ర తాబేళ్ల మృత్యువాతతో సహా మత్స్య సంపద తగ్గిపోవడానికి అదే కారణమని మత్స్యకార సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. చమురు సంస్థలు చేపట్టిన డ్రెడ్జింగ్ పనులతో గోదావరి సహజత్వాన్ని కోల్పోవడమే కాకుండా చేపలు, రొయ్యలు గోదావరి పాయల వెంబడి రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటికి ఎదురొచ్చే అత్యంత రుచికరమైన పులస చేపలు సైతం అంతరించి పోతున్నాయని చెబుతున్నారు. మత్స్య సంపద పునరుత్పత్తి లేక వేటకు వెళితే వలకు చేపలు పడటం లేదని వాపోతున్నారు.



చిర్రయానం వద్ద మృతి చెందిన తాబేలును పూడ్చి వేస్తున్న అటవీశాఖ ఉద్యోగి

అధికారుల అలసత్వం

అంతరించిపోతున్న మత్స్య జాతులు, ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ కోసం వన్యప్రాణుల సంరక్షణ పేరుతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. తాబేళ్లు, మత్స్య సంపద సంతానోత్పత్తి సమయంలో చేపల వేటపై నిషేధం ఉన్నా కొన్నిచోట్ల అనధికారికంగా పెద్ద పెద్ద ఫిషింగ్ బోట్లతో వేట సాగుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. చమురు సంస్థలు వ్యర్థాలను సముద్ర జలాల్లో వదలకుండా చూడాల్సిన అవసరముంది. అయితే కాలుష్య నియంత్రణ శాఖ, అటవీ శాఖ (వన్య ప్రాణి సంరక్షణ), మత్స్యశాఖ అధికారుల అలసత్వం కారణంగా అవేమీ అమలు కావడం లేదనే ఆరోపణలున్నాయి. మత్స్య సంపద వృద్ధి, ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ కోసం ఆయా శాఖల అధికారులంతా సమన్వయంతో కఠిన చర్యలకు పూనుకోవాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

చనిపోయిన తాబేళ్లకు పోస్టుమార్టం చేయిస్తాం

గతం కంటే ఈ ఏడాది తాబేళ్లు అధికంగానే చనిపోతున్నాయి. మత్స్యకారులు చేపల వేట చేస్తున్న సమయంలో వలల్లో చిక్కుకోవడం వల్ల తాబేళ్లు చనిపోతున్నాయని భావిస్తున్నాం. దీనిపై సముద్ర జలాల్లో చేపల వేట చేస్తున్న మత్స్యకారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. స్థానిక మత్స్యకారుల ఆరోపణల నేపథ్యంలో మృతి చెందిన తాబేళ్లకు పోస్టుమార్టం చేయిస్తాం.

– ఎంవీ ప్రసాదరావు, డీఎఫ్ఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

క్లుప్తంగా

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


రైలు పట్టాల మధ్యలో మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు పట్టాల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం.. వేట్లపాలెం శివారు ప్రాంతం గూడపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో అప్‌లైన్, డౌన్‌లైన్ ట్రాక్ మధ్యలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ట్రాక్‌మెన్ బి.గంగాధర్ గుర్తించి స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఎస్ పి.అనంత లక్ష్మి సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు షార్టు మాత్రమే ఉంది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాలకు 94406 27562 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

గొల్లప్రోలుపై అభివృద్ధి జల్లు

- ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపిన ప్రభుత్వం
- రూ. 99.06 కోట్లతో నగర పంచాయతీలో పనులు



గొల్లప్రోలులో నిర్మిస్తున్న జగనన్న కాలనీ

పిఠాపురం: గొల్లప్రోలు పంచాయతీ నగర పంచాయతీగా 2011లో మారింది. పిఠాపురం నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యం గల పంచాయతీగా పేరుంది. వ్యాపారాలకు వ్యాపారస్తులకు నిలయంగా ఉండే గొల్లప్రోలు నగర పంచాయతీ పిఠాపురం నియోజకవర్గంలో వ్యాపార కేంద్రంగాను, వ్యాపారాలకు కేంద్ర బిందువుగాను ఉంది. వాణిజ్య పంటలు పండే మెట్ట ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో ఇక్కడ వాణిజ్య పంటల వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. రాజకీయంగాను మంచి పట్టున్న నేతలు ఉండడంతో నియోజకవర్గంలో కీలక పంచాయతీగా ఉంటోంది.

వ్యాపారాలకు పుట్టినిల్లు

ఇక్కడ చేయని వ్యాపారం అంటు ఉండదు. ప్రతీ ఇంట్లోను ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేస్తుంటారు. ముఖ్యంగా కారం, వేరుశనగ, మినప, పెసర, కందులు, ఎండుమిర్చి, బియ్యం, తవుడు, ప్రత్తి, దూది తదితర మిల్లులు ఉన్నాయి. కూరగాయల వ్యాపారాల్లో ఆరితేరిన గ్రామంగా పేరుంది. ఇక్కడి నుంచి కరోనా సమయంలో కూరగాయలు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. ఎక్కువగా ఎండుమిర్చి, ప్రత్తి, పప్పుదినుసులు, చింతపండు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. ప్రత్తితో తయారు చేసే వత్తులు, కారం, పసుపు, వేరుశనగ గుళ్లు, చింతపండు ఇక్కడ తయారు చేసి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. సైకిళ్లు, మోటారు సైకిళ్లపై ఇంటింటికీ తిరుగుతూ అమ్మకాలు జరిపే వ్యాపారస్తులు ఎక్కువ మంది ఉన్నారు. నగర పంచాయతీలో నిత్యం రూ.60 లక్షల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. సుమారు 30 వేల మంది చిరు వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్నారు.

ఏళ్ల సమస్యకు పరిష్కారం

ఇక్కడ ప్రధాన సమస్యగా ఉండే సూరంపాలెం దారికి మోక్షం కల్పించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు చొరవతో రూ.20 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తయ్యాక అప్రోచ్ రోడ్లు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పంచాయతీ నడిబొడ్డున అత్యంత ప్రాధాన్యం గల మొగలి సూరీడు చెరువును అమృత్ పథకంలో అభివృద్ధి చేస్తున్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో ఇప్పటి వరకు ఇబ్బందిగా ఉన్న రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.

నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి

గొల్లప్రోలు నగర పంచాయతీలో తొమ్మిది పాఠశాలల్లో రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రాథమిక పాఠశాలలను రూ.2.36 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధికి నోచుకోని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతో పాటు నూతన భవనాలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, ఆట స్థలాల అభివృద్ధి చేసి ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణంతో వైద్య సదుపాయాలు మెరుగు

గొల్లప్రోలు నగర పంచాయతీ ప్రజలకు స్థానికంగా ఉండే పీహెచ్‌సీ మాత్రమే వైద్య సేవలు అందించేది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సేవలు మాత్రం పెరగలేదు. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వైద్య శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలతో ఒక్కసారిగా వైద్య సేవలు మెరుగుపడ్డాయి. పెరుగుతున్న ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉండే విధంగా రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు. దానికి అనుగుణంగా వైద్య సిబ్బందిని నియమించారు. ఇప్పటి వరకు అద్దె భవనంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ సొంత భవనంలోకి మారనుంది. అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధితో అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సేవలు అందుతున్నాయి. అధునాతన వైద్య పరీక్షలు ఉచితంగా పేద ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

విస్తీర్ణం– 12 చదరపు కిలోమీటర్లు
జనాభా – 23,882, స్త్రీలు 11,811, పురుషులు 12,071
వార్డులు – 20, వలంటీర్లు– 120 మంది, సచివాలయాలు 7, సచివాలయ సిబ్బంది 63
నగర పంచాయతీ సిబ్బంది 18 మంది, పారిశుద్ధ్య సిబ్బంది 46 మంది,
స్లమ్ ఏరియాలు 30, వాటర్ పైపు లైన్లు 105 కిలోమీటర్లు
ఓటర్లు 20,109 మంది, పురుషులు 10,068, స్త్రీలు 10,040, హిజ్రాలు ఒకరు
పాఠశాలలు 9, హైస్కూళ్లు 2, ప్రాథమిక పాఠశాలలు 7, జూనియర్ కాలేజీ 1

అభివృద్ధి పనులు - నిధులు

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ : రూ.80 లక్షలు
14వ ఆర్థిక సంఘం నుంచి : రూ.4.10 కోట్లు
జగనన్న నగర బాటలు : రూ.6.30 లక్షలు
గడపగడపకూ మన ప్రభుత్వం : రూ.1.60 కోట్లు
15వ ఆర్థిక సంఘం నుంచి : రూ.3.94 కోట్లు
ఎంపీ లాడ్స్ : రూ.42 లక్షలు
ఏఐబీ నిధులు : రూ.87.14 కోట్లు
అమృత పథకం : రూ.99 లక్షలు
జగనన్న ఇళ్ల పట్టాలు : 2,100 మందికి
నాడు–నేడు పాఠశాలల అభివృద్ధి : రూ.2.36 కోట్లతో


అర్బన్ హెల్త్ సెంటర్


అభివృద్ధి చేసిన జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల


అభివృద్ధి చేసిన మొగలి సూరీడు చెరువు

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి



నేను పదవీ బాధ్యతలు చేపట్టే నాటికి గొల్లప్రోలు నగర పంచాయతీ అనేక సమస్యలతో ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కావాల్సిన నిధులు మంజూరు చేయడంతో నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. సూరంపాలెం కాలనీకి వెళ్లే మార్గాన్ని అనుసంధానం చేస్తూ రూ.20 లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టాం. దీని అప్రోచ్ రోడ్డుకు మరో రూ.20 లక్షలు ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి. రెండు శ్మశాన వాటికలకు, ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు కాంపౌండ్ వాల్ నిర్మించాం.

– గంధ్రేటి మంగతాయారు, చైర్‌పర్సన్, గొల్లప్రోలు నగర పంచాయతీ

మరింత అభివృద్ధి చేస్తాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రెట్టింపు చేయడంతో మరిన్ని రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి కానున్నాయి. నగర పంచాయతీ కార్యాలయానికి నూతన భవన నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. మరిన్ని నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో రానున్న కాలంలో నగర పంచాయతీ మరింత అభివృద్ధి సాధించనుంది. కొన్నేళ్లుగా ఏ ప్రభుత్వం నగర పంచాయతీలో ఏ ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వలేక పోయింది. సీఎం వైఎస్ జగన్ చొరవతో 2,100 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాం. దీంతో ఒక కొత్త నగర పంచాయతీ ఏర్పడింది.

– పెండెం దొరబాబు, ఎమ్మెల్యే, పిఠాపురం

సీఎం వైఎస్ జగన్ సహకారంతో ప్రగతి



ఎంపీ లాడ్స్ నిధులు రూ.42 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం. ఏఐబీ నిధులు రూ. 87.14 కోట్లు వెచ్చించి మంచి నీటి సమస్యకు పరిష్కారం చూపిస్తున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి నీరు గొల్లప్రోలు ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. గొల్లప్రోలు సూరంపాలెం వాసుల చిర కాల ఆశయం అయిన ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు విడుదల కానున్నాయి. ఇప్పటికే ఉన్నతాధికారులు స్థల పరిశీలన చేశారు. త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. గొల్లప్రోలును మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాను.

– వంగా గీత, కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి

రెండు నెలల క్రితం వదిలేసి వెళ్లిన వైనం

ఈ కారు ఎవరిదో?


హుకుంపేట ఆదర్శనగర్‌లో రెండునెలల క్రితం వదిలేసి వెళ్లిన కారు

రాజమహేంద్రవరం రూరల్: రెండు నెలల క్రితం ఒక ఇంటి ముందు కారును పార్కు చేసి వెళ్లిన వ్యక్తి ఇప్పటివరకు రాకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడైనా కారును దొంగిలించుకుని వచ్చి ఇక్కడ వదిలేశారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్‌లో వీధిలో విశ్రాంత ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విజయకుమార్ ఇంటి ముందు రోడ్డుపై మారుతి సుజుకి ఎర్టీగాకారును ఒక వ్యక్తి గత ఏడాది డిసెంబర్ మూడవవారంలో వదిలేసి వెళ్లిపోయాడు. వెనుక వేరే వ్యక్తి బైక్‌పై రావడంతో అది ఎక్కి వెళ్లిపోయాడని స్థానికులు చెబుతున్నారు. కారు అక్కడ ఉంచి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఎవరూ తీసుకువెళ్లకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయి. ఈ కారు నంబరును బట్టి ఏలూరు ఆర్‌టీవో రిజిస్ట్రేషన్ కల్గి నూజివీడుకు చెందిన ఎం.ఫణీందర్‌గా చూపిస్తోంది. పోలీసులు ఈ కారు మిస్టరీని ఛేదించి యజమానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు కలుషిత ఆహారంతో అస్వస్థత


చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఎంపీ బోస్

- సకాలంలో అందిన వైద్య సాయం
- అందరూ కోలుకోవడంతో ఊపిరి పీల్చుకున్న నేతలు, అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సోమవారం కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో 460 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో సుమారు 10 మంది వరకు ఆదివారం రాత్రి వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. వీరికి ఆరోగ్య సంరక్షకుడు మందులు ఇచ్చాడు. అయితే సోమవారం ఉదయానికి వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడే వారి సంఖ్య 52 మందికి చేరుకుంది. ఈ సమాచారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దుర్గారావు దొర పాఠశాలను పరిశీలించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎన్. ప్రశాంతి, డాక్టర్ సందీప్‌నాయుడు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మణికంఠలతో పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందించారు. దీనితో అందరూ కోలుకున్నారు. వీరిలో 8 మందికి విరేచనాలు అధికంగా కావడంతో వారిని మెరుగైన వైద్యం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ సంజీవరావు, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నందికం వెంకట నాగేశ్వరరావు, వార్డెన్ చింతా శ్రీనివాస్ పరిస్థితులను చక్కదిద్దారు.

వైద్యులకు మంత్రి వేణు సూచనలు

ఇదిలా ఉండగా రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరభద్రుడితో మాట్లాడి అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి పాఠశాలకు వచ్చి విద్యార్థులకు ధైర్యం చెప్పి వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్యులను మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరభద్రుడికి సూచించారు.

కన్నీటి వీడ్కోలు

- ముగిసిన విద్యార్థుల అంత్యక్రియలు
- శోక సంద్రంగా రంపయర్రంపాలెం
- బరువెక్కిన హృదయాలతో అంతిమయాత్ర


కాకర్ల వీరవెంకట అర్జున్ అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు, గ్రామస్తులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థుల అంత్యక్రియలు సోమవారం గ్రామంలో ముగిశాయి. గ్రామానికి చెందిన కాకర్ల వీరవెంకటఅర్జున్, లావేటి రాంజీ, అన్నిబోయిన దేవీచరణ్ ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఐ.పోలవరంలోని వాగులో పడి మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మృతదేహాలు గ్రామానికి చేరుకోవడంతో ఒక్కసారిగా గ్రామస్తుల గుండెలు బరువెక్కాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారులు విగతజీవులుగా తిరిగి రావడంతో వారి పార్థివ శరీరాల వద్ద కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. తమ తోటి మిత్రుల కడచూపు కోసం విద్యార్థులు తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం గ్రామస్తులు వారి ముగ్గురికి కన్నీటితో అంతిమయాత్ర నిర్వహించి బరువెక్కిన హృదయాలతో గ్రామ శివారున ఉన్న శ్మశానవాటికలో ఒకేచోట అంత్యక్రియలు జరిపారు. మరణంలోను వీడని వారి స్నేహబంధాన్ని చూసి గ్రామస్తులు చలించారు. అంతకు ముందు మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణానికి రాట ముహూర్తం


రాట ముహూర్తంలో పాల్గొన్న అర్చకులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరుని దివ్య కల్యాణానికి సోమవారం రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో డోలు సన్నాయి మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది.

హత్య కేసులో తల్లీకొడుకులకు జీవిత ఖైదు

కాకినాడ లీగల్: స్థలం సరిహద్దు గొడవలో ఒకరిని హత్యచేసి మరో ఒకరిపై హత్యాయత్నం చేసిన కేసులో ఒక్కొక్కరికి జీవిత ఖైదు, రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాజులూరు మండలం ఆర్యావటం గ్రామంలో నివసిస్తున్న వంక నాగ వెంకట సత్యవతి, ఆమె కుమారుడు వంక శ్రీనివాస్ కలిసి పక్కన నివసిస్తున్న పితాని రామచంద్రరావు, అతని భార్య పితాని మోహన కుసుమ నాగ కుమారితో స్థలం సరిహద్దు విషయంలో 2008 సంవత్సరం నుంచి గొడవ పడుతున్నారు. 2016 ఆగస్టు 23వ తేదీన పితాని రామచంద్రరావు, అతని భార్య పితాని మోహన కుసుమ నాగకుమారిని చంపేయమని వంక నాగ వెంకట సత్యవతి చెప్పడంతో ఆమె కుమారుడు వంక శ్రీనివాస్ వారి ఇద్దరిపై హాకీ బ్యాట్‌తో దాడి చేశాడు. పితాని రామచంద్రరావు మృతిచెందగా, భార్య పిమోహన కుసుమ నాగ కుమారి తీవ్ర గాయాల పాలైంది. దీనిపై గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో వంక శ్రీనివాస్, వంక నాగ వెంకట సత్యవతిపై నేరం రుజువు కావడంతో హత్య చేసినందుకు ఒక్కొక్కరికి జీవిత ఖైదు శిక్ష, రూ. పదివేలు చొప్పున జరిమానా, హత్యాయత్నం చేసినందుకు ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష ,రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలూ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ కె.ఆదిత్యకుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

తల్లి, ఇద్దరు కుమారుల ఆత్మహత్యాయత్నం

- అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులే కారణం
- పోలీస్‌స్టేషన్ వద్ద బాధిత కుటుంబీకుల ధర్నా


చికిత్స పొందుతున్న తల్లి సునీత


చిన్న కుమారుడు శ్రీతేజ


పెద్ద కుమారుడు శ్రీరాజ్

యానాం: అప్పుల బాధ తాళలేక తల్లీకొడుకులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన యానాం పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. కొత్తపేట అగ్రహారానికి చెందిన దేగల సునీతకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు శ్రీరాజ్ ఐటీఐ చదువుతుండగా, శ్రీతేజ్ 9వ తరగతి చదువుతున్నాడు. తల్లీకుమారులు ముగ్గురూ సోమవారం వారి స్వగృహంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. విషమ స్థితిలో పడి ఉన్న వారిని స్థానికులు గుర్తించి హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దకుమారుడు దేగల శ్రీరాజ్ మాట్లాడుతూ కొత్తపేట అగ్రహారానికి చెందిన మల్లాడి పోసిరావు అనే వ్యక్తి వద్ద తమ తండ్రి దేగల శ్రీనివాసరావు రూ.15 వేలు అప్పు తీసుకున్నారని, అతనికి వడ్డీతో కలిపి రూ.25 వేలు కట్టి మిగిలిన రూ.5 వేలు త్వరలో చెల్లిస్తానని చెప్పాడన్నారు. అయితే కోర్టు నుంచి రూ.30 వేలు కట్టాలంటూ ఒక నోటీసు, రూ.1.50 లక్షలు కట్టాలంటూ మరో నోటీసు పంపారన్నారు. పోసిరావు వేధింపులు తాళలేక తన తండ్రి ఆసుపత్రి పాలై అనారోగ్యంతో మృతి చెందాడని అయినా ఆ అప్పు చెల్లించాలంటూ తమను వేధిస్తున్నాడన్నారు. ఒక్కసారిగా అంత మొత్తం కట్టలేక, అతడి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు సిద్ధపడ్డామని శ్రీరాజ్ బోరున విలపించాడు. పోసిరావును అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబీకులు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, డీఎంకే నేత అరదాడి పోసియ్య చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు.

లారీ దగ్ధం

చాగల్లు: గ్రామ శివారు డిస్కవరీ ఫ్యాక్టరీ సర్వీసింగ్ సెంటర్ వద్ద ద్రాక్ష సరఫరా చేసే ఖాళీ ట్రైలర్ లారీ షార్ట్ సర్క్యూట్ వల్ల సోమవారం దగ్ధమైంది. అ ప్రమాదం సర్వీసింగ్ సెంటర్ సమీపంలో జరగడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు అంటుకోగానే సర్వీసింగ్ సిబ్బంది అప్రమత్తమై మంటలు ఆర్పి వేశారు. స్థానికులు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న కొవ్వూరు అగ్నిమాపక అధికారి ఏవీఎస్ఎన్ వేణు, సిబ్బంది పూర్తిగా కాలకుండా నిలుపుదల చేశారు. ఐసర్ లారీ యజమాని, చాగల్లు గ్రామానికి చెందిన తోట శ్రీనివాస్ మాట్లాడుతూ అందులో లారీకి సంబంధిత రికార్డులు ఉన్నాయని తెలిపారు.